సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం ׀ 22 ׀ అక్టోబర్ ׀ 2024



శవాల వ్యాపారంలో ఆరుగురి పాత్ర?

ఏలూరు జీజీహెచ్ మార్చురీలో అనాథ శవాల వ్యాపారంపై దర్యాప్తు వేగంగా సాగుతోంది. మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను సస్పెండ్ చేశారు. 8లో ▸



పెను విషాదం

ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందిన విషాద ఘటన నిడదవోలు మండలం గోపవరంలో చోటుచేసుకుంది. 8లో ▸



అప్‌డేట్ అవ్వాల్సిందే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నారు. అప్‌డేట్, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. 8లో ▸

జెడ్పీ చైర్‌పర్సన్‌పై తిరుగుబాటు

- అవిశ్వాస తీర్మానం పెట్టాలని జెడ్పీటీసీ సభ్యుల డిమాండ్
- చైర్‌పర్సన్ పార్టీ మార్పుపై సర్వత్రా అసమ్మతి సెగ
- ఆమె నిర్ణయాన్ని విభేదించిన జెడ్పీటీసీలు
- 44 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీలోనే..
- అత్యవసర సమావేశం నిర్వహించాలని వినతి
- ఏలూరులో ప్రత్యేక భేటీ



ఏలూరు జెడ్పీ గెస్ట్ హౌస్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి నోటీసులు ఇవ్వడానికి వెళుతున్న జెడ్పీటీసీలు

సాక్షి ప్రతినిధి (ఏలూరు): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై తిరుగుబాటు మొదలైంది. వైఎస్సార్‌సీపీ విప్‌ను ధిక్కరించి చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయంతో తెలుగుదేశం పార్టీలో చేరడంపై జెడ్పీటీసీలు మండిపడుతున్నారు. ఆమె పదవికి అనర్హురాలని తక్షణమే అత్యవసర సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానం పెట్టాలనే డిమాండ్ పెరిగింది. ఈ పరిణామాల క్రమంలో గత నెలలో ఓసారి, సోమవారం మరోసారి సీఈఓకు, జాయింట్ కలెక్టర్‌కు జెడ్పీటీసీ సభ్యులు వినతిపత్రం ఇవ్వడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీడీపీ కేడర్ కూడా జెడ్పీ చైర్‌పర్సన్ చేరికను వ్యతిరేకిస్తుండటం, కొందరు ప్రజాప్రతినిధులు బహిరంగంగా విమర్శిస్తుండటంతో చైర్‌పర్సన్ పద్మశ్రీ పరిస్థితి రాజకీయంగా మరింత ఇబ్బందికరంగా మారింది.

అంతటా నిరసన సెగ : వైఎస్సార్‌సీపీ నుంచి జెడ్పీటీసీగా గెలిచి, పార్టీ విప్‌తో చైర్‌పర్సన్ అయిన పెదపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఘంటా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలనే డిమాండ్ తారాస్థాయికి చేరింది. గత నెలలో జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు పద్మశ్రీ, ప్రసాద్ జనసేనలో చేరుతున్నట్టు ప్రకటించారు. వారం రోజుల వ్యవధిలోనే జనసేన కాకుండా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో విశాఖలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరో వారానికి రెండోసారి చైర్‌పర్సన్ దంపతులు లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరి, అనంతరం సీఎం చంద్రబాబును కలిశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి టీడీపీ నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు మినహా ఇతరులెవరూ వారి చేరికలో పాల్గొనలేదు. ఇక జెడ్పీటీసీ మండలమైన పెదపాడు పరిధిలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మొదటి నుంచీ ఆమె చేరికపై అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అలాగే చింతమనేని వర్గం సోషల్ మీడియా వేదికగా, జెడ్పీ చైర్‌పర్సన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించి స్థానిక నాయకత్వంతో సంబంధం లేకుండా పార్టీలో చేర్చుకోవడం సరైన పద్ధతి కాదని బహిరంగంగానే విమర్శించారు. అధికార పార్టీ విమర్శలు, సహాయ నిరాకరణ నడుమ జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు అధికారిక కార్యక్రమాలకే పరిమితమయ్యారు. ఈ పరిణామాల క్రమంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుల నుంచి బలంగా నిరసన సెగ తగిలింది.

అనర్హత వేటుకు డిమాండ్

పార్టీ విప్‌ను ధిక్కరించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు డిమాండ్ చేస్తూ రెండు పర్యాయాలు వినతిపత్రాలు అందజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 47 జెడ్పీటీసీల స్థానాలకు గాను ఒకటి టీడీపీ, మరొకటి జనసేనలు దక్కించుకున్నారు. మిగిలిన 45 స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలోనే చేరారు. వైఎస్సార్‌సీపీలోని 44 మంది జెడ్పీటీసీ సభ్యులు విప్‌ను అనుసరించి జెడ్పీ చైర్‌పర్సన్‌గా పద్మశ్రీని గతేడాది ఎన్నుకున్నారు. వాస్తవానికి తొలుత జెడ్పీ చైర్‌పర్సన్‌గా కవురు శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. 2023లో కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఖాళీ అయిన స్థానాన్ని గతేడాది జూన్ 8న ఘంటా పద్మశ్రీతో భర్తీ చేశారు. పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 181 (1) ప్రొవిజన్‌ను అనుసరించి జెడ్పీ చైర్‌పర్సన్‌పై అనర్హత వేటువేయాలని, అత్యవసర సమావేశం నిర్వహించాలని గత నెల 28న 30 మంది జెడ్పీటీసీలు సంతకాలు చేసి జెడ్పీ సీఈఓకు వినతి పత్రం అందజేశారు. దీనిపై అధికారుల నుంచి నామమాత్రపు స్పందన కూడా లేదు.

31 మంది జెడ్పీటీసీల వినతి : ఈ క్రమంలో సోమవారం రెండోసారి జెడ్పీ సీఈఓ సుబ్బారావు, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి జెడ్పీటీసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రభుత్వ నిబంధనల ప్రకారం జెడ్పీటీసీల్లో 1/3వ వంతు సభ్యులు రాతపూర్వకంగా నోటీసు ద్వారా జెడ్పీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరే హక్కు ఉంది. ఇందుకు అనుగుణంగా 31 మంది జెడ్పీటీసీలు ఏలూరులో ప్రత్యేక సమావేశం నిర్వహించి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వినతిపత్రం ఇవ్వాలని క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ అందుబాటులో లేకపోవడంతో కొద్దిసేపు వేచి చూసి అనంతరం జెడ్పీ సీఈఓ, జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మూడు రోజుల్లోపు అత్యవసర సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం, విద్యాశాఖాధికారులతో సమీక్షలు నిర్వహించి జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యే సమయానికి అందుబాటులో లేకపోవడం గమనార్హం.



జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అర్జీల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె అర్జీలు స్వీకరించారు. విజ్ఞప్తులను అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు పరిష్కారం చూపాలన్నారు. వివిధ శాఖలు సర్వీస్ డెలివరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 179 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి దోసి రెడ్డి, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలతో అప్రమత్తం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. ఈనెల 24, 25 తేదీల్లో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మండలాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించి సిద్ధంగా ఉండాలన్నారు. రైతులను అప్రమత్తం చేయాలని, ధాన్యం తడవకుండా జాగ్రత్తలు సూచించాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించాలన్నారు. వంతెనలు, కాజ్‌వేల వద్ద కాపలా ఉంచాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు.

న్యూస్‌రీల్

తక్షణ పరిష్కారానికి చర్యలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: పోలీసుశాఖ నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలోని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులతో ఆయన మాట్లాడారు. మొత్తం 13 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన



హాస్టల్‌లో మౌలిక వసతులను పరిశీలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటరత్నమ్మ

సాక్షి స్పందన

కైకలూరు: వసతి గృహ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించారు. ఆటపాకలో సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల హాస్టల్‌లో దుస్థితిపై 'బాలికల వసతిగృహం.. అసౌకర్యాల నిలయం' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కైకలూరు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి వి.వెంకటరత్నమ్మ స్పందించారు. ఇంటి యజమాని సమక్షంలో ఇంజనీరింగ్ అధికారులతో కొలతలు తీయించారు. హాస్టల్‌లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వార్డెన్ నాగమణి పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ అమలులో విఫలం



పోస్టుకార్డులతో కాంగ్రెస్ నేతలు

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సోమవారం భీమవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. భీమవరం హెడ్ పోస్టాఫీసు వద్ద మహిళలు సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయాలంటూ సీఎం చంద్రబాబుకు ఉత్తరాలు పోస్ట్ చేశారు. కాంగ్రెస్ మహిళా నేత సోడాదాసి సిల్వియా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు తీవ్ర నిరాశతో లేఖలు రాస్తున్నారని, ఉచిత బస్సు హామీపై మాట్లాడకపోవడం మోసం చేయడమే అన్నారు. భీమవరం ఇన్ చార్జ్ అంకెం సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

భీమవరం: మున్సిపల్ క్లాప్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని 15 రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడంపై సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సమస్యలను వివరించారు. క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో 15 రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం 166 మంది, మధ్యాహ్నం 71 మంది హాజరయ్యారు.

23న దిశ సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఈనెల 23న బుధవారం ఉదయం 11 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని సీఈఓ సుబ్బారావు తెలిపారు. కేంద్ర పథకాలపై ఎంపీ పుట్టా మహేష్ అధ్యక్షతన సమీక్షిస్తారన్నారు.

చినవెంకన్నకు కాసుల పంట

33 రోజులుల.. రూ.3.03 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదును సోమవారం ప్రమోద కల్యాణ మండపంలో లెక్కించగా విశేష ఆదాయం సమకూరింది. 33 రోజులకు నగదు రూపంలో రూ.3,03,89,678, 597 గ్రాముల బంగారం, 8.244 కిలోల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.500 నోట్ల ద్వారా రూ.1,00,500 లభించాయన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులి

ద్వారకానగర్‌లో బోను ఏర్పాటు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా ఆందోళన కలిగిస్తున్న చిరుత ఆదివారం రాత్రి ట్రాప్ కెమెరాకు చిక్కింది. దీంతో చిరుత సంచారాన్ని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. చిరుతను పట్టుకునేందుకు అధికారులు సోమవారం వేటను మొదలుపెట్టారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకానగర్‌లోని వీరాంజనేయ దాబా సమీపంలో సంచరిస్తున్న చిరుత ఈనెల 19 రాత్రి పలువురి కంటపడింది. అధికారులు అందనాలమ్మ చెరువు, శ్రీ కార్తికేయ ఫ్లెయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, చిరుత పాద ముద్రలను సేకరించారు. ఎం.నాగులపల్లి, ద్వారకానగర్‌తో పాటు భీమడోలు మండలంలోని సూరప్పగూడెం, అర్జావారిగూడెం, అంబరుపేట, పోలసానిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆదివారం చిరుత పాదముద్రలను ల్యాబ్‌కు పంపి బ్రిక్స్ ఫ్యాక్టరీ వద్దే చిరుత సంచరిస్తున్నట్టు అంచనాకు వచ్చి ట్రాప్ కెమెరా అమర్చారు. ఈ క్రమంలో అదేరోజు రాత్రి 9.01 గంటలకు చిరుత బ్రిక్స్ ఫ్యాక్టరీలోకి వెళుతూ ట్రాప్ కెమెరాకు చిక్కింది. సోమవారం ఉదయం ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారి ఆషాకిరణ్, జంగారెడ్డిగూడెం, ఏలూరు సబ్ డివిజన్ అధికారులు ఎం.వెంకట సుబ్బయ్య, శ్రీదేవి, ఏలూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్వీకే కుమార్, చింతలపూడి సెక్షన్ అధికారి సురేష్ కుమార్, ఏలూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి కె.కుమార్‌సింగ్, భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత సంచరించే ప్రాంతంలో బోను ఏర్పాటు చేయించారు. బోనులో పంది మాంసం ఉంచాం. అనంతరం సిబ్బందికి సూచనలు, సలహాలనిచ్చారు. అలాగే చిరుత చిక్కే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



ద్వారకానగర్‌లో బ్రిక్స్ ఫ్యాక్టరీలోకి వెళుతుండగా ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



పులి సంచరిస్తున్న ప్రాంతంలో బోను ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

విద్యుత్ సంస్థలో బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్‌ను విశాఖలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఎల్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, విశాఖలోని ఆ పోస్టులో పనిచేస్తున్న పీవీవీ సత్యనారాయణను ఏలూరు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థానానికి బదిలీ చేశారు. అలాగే ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) పీర్ అహ్మద్‌ఖాన్‌ను జంగారెడ్డిగూడెం ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థానానికి, ఆ స్థానంలో పని చేస్తున్న పి.రాధాకృష్ణను ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) స్థానానికి బదిలీ చేశారు. అలాగే పలువురు విద్యుత్ డీఈఈలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఏలూరు పవర్‌పేట సీ అండ్ ఓ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.పద్మినికి పదోన్నతి కల్పించి జీలుగుమిల్లి ఆపరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుతం జీలుగుమిల్లి డీఈఈగా ఉన్న టి.రాజ్‌కుమార్‌ను ఏలూరు టౌన్ ఆపరేషన్ డీఈఈగా బదిలీ చేశారు. ఏలూరు టౌన్ ఆపరేషన్ డీఈఈ బీవీ కృష్ణ రాజును పెదవేగి ఆపరేషన్ డీఈఈగా బదిలీ చేశారు.

బాలుర హాస్టల్ సందర్శన

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ.సురేష్‌బాబు సోమవారం స్థానిక బ్రిడ్జి పేటలోని గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహాన్ని సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్‌లో ఫ్యాన్లు పనిచేయడం లేదని, లైట్లు తక్కువగా ఉన్నాయని విద్యార్థులు న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. మండల న్యాయ సేవా సంస్థకు అర్జీ పెట్టాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన హాస్టల్‌లో రిజిస్టర్లను, వంట గదిని, స్టోర్ రూమ్‌ను, బెడ్ రూమ్‌లను పరిశీలించారు. ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, ఎస్.సుధీర్, పి.అంబేడ్కర్, బి.లోకేశ్వరరావు, కె.జ్యోతి, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.



సౌకర్యాలపై ఆరా తీస్తున్న జడ్జి సురేష్‌బాబు

సహకార సంఘాలు ఉత్తమ సేవలందించాలి

ఉండి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం (ఎరువుల వ్యాపారం)పై అందిస్తున్న సర్టిఫికెట్ కోర్సు ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో 76 సొసైటీల ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లా కో- ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో భారం

వీరవాసరం: సర్దుబాటు చార్జీలు పెంచే ప్రతిపాదనను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయం విరమించుకోవాలని, విద్యుత్ సంస్కరణలు ఆపాలని, కార్పొరేట్లకు వరాలు ప్రజలపై భారాలు అనే నినాదాలతో వీరవాసరం విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.8,113 కోట్లు ప్రజలపై భారాలు వేయడాన్ని విరమించుకోవాలన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమన్న చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ సంస్థల ప్రతిపాదనలను అంగీకరించడంపై విమర్శించారు. మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయ, రెడ్డి రాము, ఆయనపూడి బాబురావు, పాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం

మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పోలీస్ అమరవీరుల దినం సందర్భంగా సోమవారం భీమవరం మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద మండలి చైర్మన్, కలెక్టర్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం మండలి చైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన పోలీసులు చిరస్మరణీయులన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఎస్పీ నయీం అస్మి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమరవీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన అమర వీరుల పేర్లను (రోల్ ఆఫ్ హానర్) కలెక్టర్ నాగరాణి ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి అందజేశారు. అనంతరం జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన ఎ.నాగేశ్వరరావు, డి.పీటర్, డీహెచ్‌వీజీ శ్రీనివాస్, ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యుల త్యాగాలకు గుర్తుగా వారి కుటుంబాలకు జ్ఞాపికలు అందజేశారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘురామ కృష్ణరాజు, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



శవాల వ్యాపారంలో ఆరుగురి పాత్ర?

- ఏలూరు జీజీహెచ్ మార్చురీ అసిస్టెంట్ సస్పెన్షన్
- సాక్షి కథనంపై స్పందించిన అధికారులు

సాక్షి స్పందన



ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీలో అనాథ శవాల అక్రమ వ్యాపారంపై దర్యాప్తు వేగవంతం చేశారు. ఏలూరు నుంచి అక్రమంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు అనాథ శవాలను భారీ రేటుకు తరలించినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రి (సర్వజన ఆసుపత్రి)లో అవినీతి బాగోతంపై ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్ ఆదేశాలతో అధికారుల బృందం విచారణ చేపట్టింది.

మార్చురీ అసిస్టెంట్ అశోక్ సస్పెన్షన్

ఆసుపత్రి మార్చురీ విభాగంలో పనిచేస్తున్న మార్చురీ అసిస్టెంట్ అశోక్‌ను సస్పెండ్ చేస్తూ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8న రాత్రి మార్చురీలో ఉన్న అనాథ శవాన్ని అంబులెన్సులో ఎక్కించి చెన్నై మెడికల్ కాలేజీకి తరలించడానికి మార్చురీ అసిస్టెంట్ అశోక్ ప్రయత్నించాడు. డ్యూటీలోని మరో అవుట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగిని అశోక్‌ను నిలదీయడంతో భయపడి శవాన్ని తీసుకొచ్చి మార్చురీలో పెట్టేశాడు. ఈ సంఘటనపై ఆ ఉద్యోగిని రాతపూర్వకంగా ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. డాక్టర్ భాస్కర్ ఈ నెల 18న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశిధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ దందాపై విచారణ చేసి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. సీహెచ్ సుధాకర్‌ను ప్రిన్సిపల్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో అశోక్‌ను సోమవారం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అనాథ శవాల విక్రయాలపై నిర్ధారణ

మార్చురీ నుంచి అనాథ శవాలను భారీ రేటుకు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్జన చేసినట్లు అధికారుల విచారణలో ప్రాథమికంగా నిర్ధారించారు. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, నంద్యాలలోని ఒక మెడికల్ కళాశాలకు మృతదేహాలు తరలించినట్లు విచారణలో గుర్తించారని తెలిసింది. అధికారికంగా ప్రభుత్వ అనుమతులతో రుసుం చెల్లించి మృతదేహాల్ని ఇవ్వాల్సి ఉండగా అక్రమ దందాకు పాల్పడినట్లు స్పష్టమైంది. మెడికల్ కళాశాలకు సంబంధించి మార్చురీ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ వారితో పోస్టుమార్టం పనులు చేయించకుండా కేవలం వేరే వారు విధులు నిర్వర్తించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ వ్యాపారంలో ఆరుగురి పాత్ర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. విచారణ పూర్తి చేసి రెండు, మూడు రోజుల్లో నివేదికను వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇవ్వనున్నారు. మార్చురీ రికార్డుల్లో అనాథ మృతదేహాలను మున్సిపాలిటీకి ఇవ్వకుండా మెడికల్ కళాశాలకు అక్రమమార్గంలో పంపిస్తూ.. అనాథ శవాలకు సంబంధించి రిజిస్టర్‌లో ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లతో సంతకాలు పెట్టించినట్లు స్పష్టమవుతుంది. ఏలూరుకు చెందిన అంబులెన్స్‌ల్లో తరలిస్తే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాలకు చెందిన అంబులెన్సులు తీసుకువచ్చి మృతదేహాలను తరలించినట్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మృతి చెందిన చరణ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్ : విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో కోతమిషన్‌లో చోటు చేసుకుంది. పుట్లగట్లగూడెంకు చెందిన కవులూరి చరణ్ (20) కోతమిషన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం చెట్ల దుంగను రంపం బ్లేడ్‌తో చరణ్, మరో ఇద్దరు కోస్తుండగా మోటార్‌కి విద్యుత్ సరఫరా వచ్చింది. దీంతో మోటార్‌ను పట్టుకుని ఉన్న చరణ్ షాక్‌కి గురయ్యాడు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోతమిషన్ యాజమాన్యం నిర్లక్ష్యంతో చరణ్ మృతి చెందాడని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. జంగారెడ్డిగూడెం ఆస్పత్రి వద్దకు చేరుకున్న సీఐటీయు నాయకులు మృతుడి కుటుంబానికి రూ.30 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నం

యలమంచిలి: తండ్రి మందలించాడనే కోపంతో పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఈద కోదండరాం (19) ఆదివారం సాయంత్రం చించినాడ వద్ద వశిష్ట గోదావరిలో దూకినట్లు అనుమానిస్తున్నారు. కోదండరాం ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉండడంతో తండ్రి మందలించాడు. కోపంతో ఇంటి నుంచి వచ్చేశాడు. అతని పాదరక్షలు చించినాడ వంతెనపై కనిపించడంతో గోదావరిలో దూకాడేమోనని అనుమానంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై కర్ణీడి గురయ్య ఆధ్వర్యంలో పోలీసులు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు.

అక్రమ కలప స్వాధీనం


కొయ్యలగూడెంలో అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

కొయ్యలగూడెం: అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న కలపను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కన్నాపురం అటవీశాఖ కార్యాలయ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తాడేపల్లిగూడెంకు వాహనంలో తీసుకెళ్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలప విలువ రూ.31,845 ఉంటుందన్నారు.

విద్యార్థుల నుంచి రచనలకు ఆహ్వానం

భీమవరం: బాలల దినోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని విద్యార్థుల నుంచి స్వీయరచనలు కోరుతున్నట్లు సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నవభారత నిర్మాణం, విద్యార్థుల పరిశోధనలు–నూతన ఆవిష్కరణలు, పొదుపు–నిరాడంబరత, నీతి కథలు రచనలను నవంబర్ 5 లోపు సర్వోదయ మండలి కార్యదర్శి, గాంధీ కస్తూర్బా భవనం, శ్రీరాంపురం, భీమవరం–2 చిరునామాకు పంపించాలన్నారు.

కబడ్డీ పోటీలకు తణుకు విద్యార్థి ఎంపిక


కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

తణుకు టౌన్: తణుకు ఎస్కేఎస్‌డీ.. ఎస్సీవీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి టి.విమలాకర్ ఈ నెల 30 నుంచి నవంబరు 3 వరకూ తమిళనాడులో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మారుతీదేవి చౌదరి తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో మండపేటలో నిర్వహించిన ఇంటర్ కాలేజీయేట్ పురుషుల కబడ్డీ పోటీలలో విమలాకర్ జట్టు విజేతగా నిలిచినట్లు తెలిపారు.

అన్యోన్య దాంపత్యంలో పెను విషాదం

- ఆర్టీసీ బస్సు ఢీకొని పైడిపర్రుకు చెందిన దంపతులు మృతి
- నిడదవోలు మండలం గోపవరంలో ఘటన


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దుర్గ మృతదేహాలు

నిడదవోలు రూరల్: మరో ఐదు నిమిషాల్లో శుభకార్యానికి చేరుకుని బంధుమిత్రులతో సంతోషంగా గడపాల్సిన ఆ దంపతులిద్దరూ మృత్యువాత పడ్డారు. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో స్కూటీపై వెళ్తున్న భార్యాభర్తలు ప్రాణాలు కోల్పోయిన ఘటన నిడదవోలు మండలం గోపవరం జంక్షన్ శ్రీవే హోటల్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన భార్యాభర్తలు బెల్లంకొండ వెంకటేశ్వరరావు (60), దుర్గ (50)లు స్కూటీపై కొవ్వూరు మండలం మద్దూరులోని బంధువులైన టేకుమూడి శ్రీను ఇంట్లో ఉయ్యాల ఫంక్షన్‌కు వెళ్తున్నారు. గోపవరం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంకటేశ్వరరావు, దుర్గలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతులు వెంకటేశ్వరరావు బంటామేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కొడుకు, కూతురు ఉండగా ఇద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెలగన వీరబాబు నిర్లక్ష్యంగా బస్సు నడపడంతో తన తల్లిదండ్రులు మృతిచెందారని కొడుకు పద్మారావు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు తెలిపారు.

పైడిపర్రులో విషాదం

తణుకు: అన్యోన్యంగా ఉండే దంపతులు... చుట్టుపక్కల ప్రాంతాల్లో అందరికి తలలో నాలుకలా ఉండే వారు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారనే వార్తను స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. వారి స్వగ్రామం పైడిపర్రులో తీవ్ర విషాదం అలముకుంది.

విహారయాత్ర విషాదాంతం

సోకులేరు వాగులో పడి యువకుడి గల్లంతు


రవితేజ

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా) : చింతూరు మండలం సోకులేరు వాగు వద్ద స్నానం చేస్తుండగా యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. దీంతో విహారయాత్ర విషాదంగా మారింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు నుంచి కరణం రవితేజ (26) పది మంది స్నేహితులతో కలిసి ఈ నెల 18న విహార యాత్రకు బయలుదేరారు. దీనిలో భాగంగా అదేరోజు మండలంలోని సోకులేరు వ్యూపాయింట్‌కు వచ్చారు. అక్కడ స్నేహితులతో కలిసి వాగులో దిగాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. అప్పటినుంచి రవితేజ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం మృతదేహం లభ్యమైందని స్థానిక పోలీసులు తెలిపారు. సోకులేరు వ్యూపాయింట్‌కు సుమారు కిలోమీటరు దూరంలో మృతదేహాన్ని గుర్తించామని ఎస్‌ఐ శివన్నారాయణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఆయన వెల్లడించారు. విహారయాత్రకు వచ్చిన వారంతా ఈవెంట్ డెకరేషన్ కార్మికులుగా పనిచేస్తున్నారు.

నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలి

ఏలూరు (టూటౌన్): దేశాభివృద్ధిలో కీలకంగా ఉన్న నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ఎం.సాయిబాబా డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏపీ భవన నిర్మాణ కార్మికుల వర్క్‌షాపు రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎం.సాయిబాబా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ప్రమాదానికి గురై మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం బోర్డు నుంచి అందించాలని డిమాండ్ చేశారు. వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు, కోశాధికారి కె.వి.గోపాలరావు, రాష్ట్ర నాయకులు పిల్లి నరసింహారావు, ఎం.సుందర్ బాబు, అల్లాడి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో వీ2వీ అప్లికేషన్స్‌ది కీలక పాత్ర


వాసవీలో మాట్లాడుతున్న వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ కాదంబరి

తాడేపల్లిగూడెం : భవిష్యత్‌లో వీ2వీ అప్లికేషన్స్ కీలక భూమిక పోషిస్తాయని వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ కేవీ కాదంబరి అన్నారు. పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర డిపార్టుమెంటు ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ , సైన్సు అండ్ రీసెర్చ్ బోర్డు సహకారంతో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలు అంశాలు వక్తలు మాట్లాడారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్ ఆధారిత యాంటెన్నాలు అంశంపై విశదీకరించారు. నిట్ ఏపీ ఎలక్ట్రానిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.యువరాజు ఓఏఎం యాంటెన్నాస్ ఫర్ వీ2వి అప్లికేషన్స్ అనే విషయాలను వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు మాట్లాడుతూ నూతన సాంకేతిక అంశాల అవగాహనకు వర్కుషాపులు ఉపయోగపడతాయన్నారు.

అధిక పురుగుమందుల వాడకంతో అనర్థం

పెనుమంట్ర: విచక్షణా రహితంగా పురుగుమందులు పిచికారి చేయడం వల్ల సాగు ఖర్చులు పెరగడమే కాకుండా రైతులకు కేన్సర్, దృష్టి లోపాలు, చర్మవ్యాధులు, వంటి సమస్యలు కూడా తలెత్తుతాయని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సిద్ధిఖీ అన్నారు. సోమవారం మార్టేరు వరి పరిశోధనా స్థానంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిద్ధిఖీ మాట్లాడుతూ.. శిక్షణా కార్యక్రమం ద్వారా సమగ్ర సస్యరక్షణలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఏర్పరచుకుని రైతులకు అందించాలని కోరారు.

అప్‌డేట్ అవ్వాల్సిందే..

నాలుగు రోజుల పాటు ఆధార్‌లో మార్పు చేర్పులకు అవకాశం


ఆధార్ ప్రత్యేక శిబిరం

నూజివీడు : ప్రస్తుతం మనదేశంలో ఏ పని జరగాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. తిరుమలలో శ్రీవారి దర్శనం దగ్గర నుంచి.. తిరుపతి వెళ్లేందుకు రైలు టిక్కెట్ బుక్ చేసుకునే వరకు ఆధార్ అవసరంగా మారిపోయింది. సిమ్ కార్డు కావాలన్నా, కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు అడ్రస్సు ప్రూఫ్ కోసం, బ్యాంకు ఖాతా తెరవాలన్నా, పాన్‌కార్డు కావాలన్నా, ఇలా ప్రతి దానికి ఆధార్ నెంబరే ప్రామాణికంగా మారింది. అయితే ఆధార్ కార్డులను జారీ చేసేటప్పుడు అనేక తప్పులు దొర్లుతుండటంతో ఆ తరువాత కార్డుదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వయసు తప్పు పడటం, పేరులోని అక్షరాలు తప్పుగా నమోదు కావడం, పుట్టిన రోజు సరిగా లేకపోవడం తదితర దోషాలతో వాటిని మార్చుకోవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తోంది. మండలానికి ఒక్క ఆధార్ కేంద్రం కూడా లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోక ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల 20 కిలోమీటర్ల దూరంలో ఉండే పక్క మండలంలోని ఆధార్ కేంద్రానికి సైతం వెళ్తున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ఈ పరిస్థితుల్లో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు జిల్లాలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీటిని సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి ఆధార్ కార్డుల్లో నమోదైన తప్పులను సరిచేయనున్నారు. చిరునామా మార్పు, తండ్రి, తల్లి పేర్లలో తప్పులు ఉంటే వాటిని మార్చడం, కార్డుదారుడి పేరులో అక్షర దోషాలు ఉంటే వాటిని సరిచేయడం, ఫొటో, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం, పుట్టినరోజులో తప్పులు సరిచేయడం, 0–5 ఏళ్ల లోపు పిల్లలకు బాల ఆధార్‌కార్డుల జారీకి నమోదు చేసుకోవడం వంటి సేవలు ఈ ప్రత్యేక శిబిరాల్లో అందుబాటులో ఉంటాయి. బాల ఆధార్‌కార్డు తీసుకున్న వారు పదేళ్లకొకసారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఇలా అప్‌డేట్ చేయడం వల్ల పౌరుల తాజా సమాచారమంతా కేంద్ర గుర్తింపు సమాచార నిధి వద్ద అప్‌డేట్ అవుతూ ఉంటుంది. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి. ఏలూరు జిల్లాలో వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారు 3,71,664 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2,33,972 మంది ఉన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. చిన్న పిల్లలకు నూతన ఆధార్ కోసం నమోదు, ఆధార్ కార్డుల్లో సవరణలు, వేలిముద్రల అప్‌డేట్, చిరునామా మార్పు, పేర్లలో అక్షర దోషాల మార్పు తదితర అనేక సేవలు అందుబాటులో ఉంటాయి.
– చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంపీడీఓ, నూజివీడు

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నాదెండ్ల

ఆలయ ముఖ ద్వారాలు మూసివేయడంతో భక్తుల ఇక్కట్లు


వేద ఆశీర్వచనం పొందుతున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యేలు


శ్రీవారి ఆలయ ముఖ ద్వారం మూసివేసి, అడ్డుగా నిలుచున్న సెక్యూరిటీ

ద్వారకాతిరుమల: రాష్ట్ర పౌర సరఫరాలు శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ద్వారకాతిరుమలలో సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి పలువురు ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. వేద పండితులు స్వామి వారి ఆశీర్వచనాన్ని అందించారు. మంత్రి ఆలయంలోకి వెళ్లగానే ఆలయ ముఖ ద్వారాలను మూసివేయడంతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 20 నిమిషాల తరువాత తలుపులు తెరిచారు. సాయంకాలార్చన సమయం 5.30 గంటల నుంచి కావడంతో ఎక్కడ దర్శనం నిలిపివేస్తారోనని భక్తులు ఆందోళన చెందారు. గవర్నర్, ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఇలా ఇప్పటి వరకు ఎంత మంది ప్రముఖులు వచ్చినా.. ఎన్నడూ ఆలయ ద్వారాలను ఇలా మూసివేసిన ఘటనలు లేవు. అధికారులు, కూటమి నేతల అత్యుత్సాహం కారణంగానే ఇలా జరిగిందని పలువురు అంటున్నారు.

సైనికుడి మృతికి నివాళి



కొయ్యలగూడెంలో రావిపాటి ప్రవీణ్ కుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ విజయ కుమారి (ఇన్‌సెట్లో ప్రవీణ్ కుమార్)

కొయ్యలగూడెం: ఆర్మీలో హవాల్దర్‌గా సేవలందించి భరతమాత ముద్దుబిడ్డగా ప్రవీణ్ కుమార్(40) కీర్తి సంపాదించారని పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన రావిపాటి ప్రవీణ్ కుమార్ ఆర్మీలో విధులు నిర్వహిస్తూ కొయ్యలగూడెం నుంచి రాజస్తాన్‌కు వెళుతున్న క్రమంలో 20వ తేదీ రాత్రి వైజాగ్ రైల్వే స్టేషన్లో గుండెపోటుతో మృతి చెందారు. కొయ్యలగూడెం చేరుకున్న భౌతికకాయం వద్ద ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు.

అధ్యాపకుడికి జాతీయ పురస్కారం


అబ్దుల్ కలాం అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు జి.వెంకట లాల్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జి.వెంకటలాల్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డును అందుకున్నారు. ఆదివారం గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం(అక్టోబర్ 5) పురస్కరించుకుని అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాహిత్యానికి, ఉపాధ్యాయ వృత్తికి ఉత్తమ సేవలందిస్తున్నందుకు తెలుగు అధ్యాపకులు డాక్టర్ జి.వెంకటలాల్ అవార్డు అందుకున్నారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు (టూటౌన్): బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసారని పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. కోర్సు పూర్తయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, సర్వ శిక్షా అభియాన్‌లో రీసోర్సు టీచర్లుగా, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ తదితర విద్యాలయాల్లో ఉపాధి పొందవచ్చన్నారు. అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99486 00642 నెంబరులో సంప్రదించాలన్నారు.

భీమవరంలో గంజాయి పట్టివేత

భీమవరం: భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. జీఆర్పీ పోలీసులు గంజాయి తరలిస్తున్న జెర్రిపోతుల రమణమ్మను సోమవారం అరెస్టు చేసి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రికి చెందిన రమణమ్మ గంజాయిని వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటుందని ఎస్సై రమణ తెలిపారు.

28 కాసుల బంగారు ఆభరణాల చోరీ

భీమవరం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లో రూ.7 లక్షల విలువైన 28 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు సోమవారం చెప్పారు. కె.నాగఉమామహేశ్వరి ఈ నెల 20న వీరవాసరం నుంచి ఆర్టీసీ బస్‌లో భీమవరం వస్తుండగా పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్దకు వచ్చే సరికి ఆమె బ్యాగ్‌లోని 28 కాసుల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు చెప్పారు.

మనస్థాపంతో గృహిణి ఆత్మహత్య

నరసాపురం రూరల్: మద్యానికి బానిసైన భర్తను చూసి మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మొగల్తూరు మండలం పేరుపాలెంలో చోటు చేసుకుంది. మొగల్తూరు ఎస్సై జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన లక్కవరపు అనూష(25) ఆమె భర్త మాణిక్యాల రావు మద్యానికి బానిసగా మారాడు. భర్త తీరు మారకపోవడంతో ఈ నెల 19న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాయచూర్‌లో ఉన్న మృతురాలి తల్లి తివారి అంజలి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

నూజివీడు: మండలంలోని పాతరావిచర్లలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం రాత్రి మెరుపుదాడి చేశారు. సిబ్బందితో కలిసి ఏఎస్సై దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. 8 ద్విచక్ర వాహనాలను, రూ.84,560 స్వాధీనం చేసుకున్నారు. శిబిరంను నెల రోజులకు పైగా నడుస్తున్నట్లు, నిర్వాహకులు టీడీపీకి చెందిన వారుగా గ్రామంలో ప్రచారం జరుగుతోంది.

నేడు ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ద్వారా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, కలిదిండి, భీమవరం(స్టాఫ్ క్వార్టర్ల స్థలం), ఆకివీడు, మార్టేరు బస్ స్టేషన్లలో ఉన్న ఖాళీ స్థలాలను 15 సంవత్సరాల లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక వ్యాపారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు రీజనల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఈ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాటు సారా స్వాధీనం

కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామంలో నాటుసారా సరఫరా చేస్తున్న నిందితుడిని కుక్కునూరు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కుక్కునూరు సీఐ రమేష్ బాబు వివరాల ప్రకారం.. కొద్ది రోజులుగా నూనావత్ సురేష్ నాటుసారా సరఫరా చేస్తున్నాడన్న సమాచారం మేరకు నిఘా పెట్టామన్నారు. సోమవారం సారాతో వేలేరు గ్రామంలో ఉండగా 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్



■ భీమవరంలో ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ 90305 26489. [P-772877]

■ ఏలూరులో ప్రముఖ శ్రీకృష్ణ హాస్పటల్‌లో పనిచేయుటకు స్టాఫ్ కావలెను. అనుభవం గల నర్సులు GNM (2 సం॥లు ICU నందు అనుభవం). జీతం: 18,000/- సంప్ర॥ 91540 69506. [P-749615]

■ విజయవాడ, హోమ్‌కేర్ సర్వీసెస్ శ్రీమంతుల ఇళ్ళలో పనిచేయుటకు పెద్దవారికి, పేషెంట్లను చూచుకొనుటకు వర్కర్స్ 24/7 కావలెను. రూం+ భోజనం ఫ్రీ. జీ:15000-18000/- 9492993025, 8500573025 [G-782936]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185488]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995984445 [HA-98759]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1380]

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



క్లుప్తంగా

కవి సమ్మేళనంలో ప్రసాద్‌కు పురస్కారం



కవి ప్రసాద్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

తణుకు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెంలో ఈనెల 19, 20 తేదీల్లో 24 గంటల పాటు ఏకధాటిగా నిర్వహించిన తెలుగు సాహితీ కళాజాతర కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలకు ప్రార్థన శీర్షికతో ఆయన రచించి వినిపించిన కవితకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కొల్లి రమావతి, టి.పార్థసారధి, ఎం.అరుణ చేతుల మీదుగా కవి ప్రసాద్‌కు ప్రసంశాపత్రం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.

మండల పరిషత్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ మండల అధికారులకు ప్రజలు అందించే సమస్యలపై అన్ని శాఖల అధికారులు సత్వర పరిష్కారం చూపించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలపై ఐదు అర్జీలు స్వీకరించినట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఎంఈవో వి.హనుమ, వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన



మునిసిపల్ కార్యాలయంలో బాల్య వివాహ నిరోధంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహ నిరోధంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీ సమావేశం సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఈ నెలలో జరిగిన ప్రగతిపై సమీక్ష చేశారు. బాల్యవివాహ నిరోధంపై మునిసిపల్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుతో, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఏసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భవాని, కె.విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు అర్జీల అందజేత



ప్రజా పరిష్కారవేదిక కార్యక్రమంలో ఫిర్యాదు ఇస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పరిష్కారవేదికలో ఆరు ఫిర్యాదులు వచ్చాయి. పారిశుద్ధ్యంపై ఐదు, ఇతర సమస్యలపై ఒక ఫిర్యాదు వచ్చింది. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ప్రజల సమ్యస్యలను త్వరగా పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పల్లెల సమగ్రాభివృద్ధే లక్ష్యం



పరిమెళ్లలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు: పల్లెల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పరిమెళ్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తున్న వారికి ప్రజలు తప్పక మద్దతు ఇవ్వాలన్నారు. పరిమెళ్లగ్రామంలో రూ. 50 లక్షలకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ హైమావతి, సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీసాలో పాత మద్యం !

- పాత ధరలకే మద్యం విక్రయాలు
- అందుబాటులో లేని రూ. 99 మద్యం



తణుకు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు మద్యం దుకాణం

తణుకు: ప్రైవేటు మద్యం పాలసీ కూటమి నేతలకు కిక్కు ఇస్తోంది. మద్యం ధరలను తగ్గిస్తాం. నాణ్యమైన బ్రాండులను అందుబాటులోకి తెస్తాం.. క్వార్టర్ మద్యం రూ.99కే విక్రయిస్తాం. అంటూ గొప్పల డప్పు కొట్టిన కూటమి ప్రభుత్వం మందుబాబుల జేబులకు చిల్లు పెడుతోంది. గత ప్రభుత్వ హయాంలోని మద్యాన్ని పాత ధరలకే విక్రయిస్తోంది. తక్కువ ధరకు బ్రాండ్ మద్యం దొరుకుతుందని మందు షాపులకు వెళ్లిన వారు అక్కడ వసూలు చేస్తున్న ధరలను చూసి కళ్లు తేలేస్తున్నారు. కొత్త విధానం పేరుతో కూటమి ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు చేసింది. అక్కడ పనిచేస్తున్న చిరుద్యోగుల ఉపాధిని లాగేసుకుని వారిని రోడ్డుపాలు చేసింది. ఇప్పుడు టెండర్లద్వారా కేటాయించిన మద్యం షాపులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తణుకు పట్టణంతోపాటు తణుకు, ఇరగవరం, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో 33 షాపులను కేటాయించారు. అయితేవాటిలో కొత్త మద్యం అందుబాటులోకి రాలేదు. పాత మద్యమే విక్రయించడం మద్యం ప్రియులను అసంతృప్తికి గురి చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న మద్యాన్ని అవే ధరలకు విక్రయిస్తుండగా, కొన్ని చోట్ల కొత్త బ్రాండ్ పేరుతో అధికార ధరలు వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు.

అందుబాటులోకి రాని రూ.99 మద్యం

ఎన్నికల ముందు కూటమి పెద్దలు తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గిస్తామని, క్వార్టర్ రూ.99కే అందిస్తామని హామీలు గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చాక దానిని ఆచరణలో పెట్టలేదు. ఇప్పుడు టెండర్లు పిలిచి అత్యధిక దుకాణాలు తమ అనుచరులకు కట్టబెట్టారనే చర్చ జరుగుతోంది. రూ.99 బ్రాండ్‌ను అందుబాటులోకి తీసుకురాకపోగా గత ప్రభుత్వ హయాంలో సరఫరా అయిన మద్యాన్ని 90 శాతం షాపుల్లో పాత ధరలకే విక్రయిస్తున్నారు. అత్యధిక షాపుల్లో క్వార్టర్ విస్కీ రూ.180, మాన్షన్ హౌస్ రూ.220, ఛీప్ లిక్కర్ రూ.130 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్రాండ్లే అందుబాటులో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే కొందరు మాత్రం కొత్త బ్రాండ్ల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. మరోవైపు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 33 మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారస్తులకు అధికారులు తాత్కాలిక లైసెన్స్ జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన ఖరారు చేసిన టెండర్ల తరువాత అదే రోజు లైసెన్స్ ఫీజులో ఆరో వంతు డబ్బు వసూలు చేశారు. బ్యాంకుల ద్వారా నగదు చెల్లించిన 33 షాపులకు 15 రోజుల గడువుతో లైసెన్స్ జారీ చేశారు. అన్ని ధ్రువపత్రాలు సమర్పించాక రెండేళ్ల కాల పరిమితితో లైసెన్స్ జారీ చేయనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



వర్కర్స్‌కు రక్షణ కిట్స్ అందజేస్తున్న కమిషనర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అధికార్లు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. ప్రజలందూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం శానిటేషన్ సెక్రటరీలకు వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం జరిగింది.

సెప్టిక్ క్లీన్ వర్కర్స్‌కు రక్షణ కిట్స్ అందజేత

స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టిక్ క్లీన్ చేస్తున్న వర్కర్లును సర్వేలో భాగంగా 9 మందిని గుర్తించగా వారికి రక్షణ నిమిత్తం కమిషనర్ ఏసుబాబు హెల్మెట్లు, గంబూట్లు, కళ్ళజోడ్లు సమాగ్రి కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవి సుధాకర్, ఏసీపీ సీతారామ్, రెవెన్యూ అధికారి రవి కుమార్, డీఈఈ రామారావులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి



ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధులు వ్యాపించే నేటి రోజుల్లో విద్యార్థుల ఆరోగ్యానికి ఉపాధ్యాయులు తగిన ప్రాధాన్యతనివ్వాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు నంబరు 7, 11 మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారానికోసారి విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయాలని, విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఎటువంటి నిరుపయోగ నీటినిల్వలు ఉంచరాదని అన్నారు. అనంతరం బాలుర హాస్టల్‌లో మస్కిటో మెషింగ్ ప్రూఫ్, తాగునీరు, హైజీన్ అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీలు కె.మారమ్మ, వై.సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి



మాధవరం గ్రామంలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాధవరం గణపతి సెంటర్‌లో గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘ మండల సమితి సమావేశం గంధం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఇసుక సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా యాప్ రూపొందించాలన్నారు. విధి విధానాలు సరిగా లేకపోవడం వల్ల కార్మికులు పనిలేక తీవ్ర దుర్భిక్ష పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి పి.ఆదినారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్‌బోర్డును అమలు చేయాలన్నారు. పెండింగ్ క్లయిమ్‌లకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ మాట్లాడారు. సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడే సాయి బాలాజీ, గోదావరి గ్రామీణభవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి కంకిపాటి రాజు, సహాయ కార్యదర్శి నూకల సత్యనారాయణ, రుద్ర శ్రీనివాస్, పోతురాజు, ఎల్.ఆంజనేయులు, జి.హనుమంతు, సిద్ధిరెడ్డి సత్యనారాయణ, గంధం పోసిబాబు, శీలి నాగరాజు, పలివెల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పరిమెళ్లలో అగ్ని ప్రమాదం

రూ. 5 లక్షల ఆస్తి నష్టం





పరిమెళ్లలో అగ్నిప్రమాద దృశ్యాలు

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ. 5 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాశాఖలో సీఆర్‌పీగా పనిచేసే చిరుద్యోగి ఇంట్లో ఈ ప్రమాదం జరిగింది. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఏసీ, నిత్యావసరాలు, దుస్తులు, టీవీ, మంచం, ఇంటితలుపులు, చిన్నారులు ఆడుకొనే బొమ్మలతో సహా సర్వం కాలిబూడిదయ్యాయి.

పోలీస్ అమర వీరులకు ఘన నివాళి



తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో నివాళులు అర్పిస్తున్న పోలీసు అధికారులు



తణుకు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

తణుకు: దేశంలో నెలకొన్న ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వశక్తులు, అసాంఘిక శక్తుల బారి నుంచి ప్రజలను కాపాడటంలో తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరులను స్మరించుకోవాల్సి ఉందని తణుకు పట్టణ సీఐ కొండయ్య పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తణుకు సర్కిల్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు స్థానిక నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంస్మరణ స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐ కొండయ్య మాట్లాడుతూ నిత్యం అవిశ్రాంతంగా పోరాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు ఎనలేని సేవలు చేస్తూ ప్రాణత్యాగాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీనివాస్, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో...

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు రూరల్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరవీరులైన పోలీసులకు నివాళులు అర్పించి అనంతరం తేతలి వైజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో ఉచిత దంత వైద్య శిబిరం

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి, భీమవరం విష్ణు దంతవైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అత్తిలి లయన్స్‌క్లబ్ భవనంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ డీసీ యాతం రాంబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. శింగులూరి ఘంటారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రశేఖర్ ఆర్థిక సహాయంతో జరిగే దంత వైద్యశిబిరంలో ఉచితంగా దంత పరీక్షలు, చికిత్స, పళ్లను శుభ్రపర్చడం, పుచ్చిన పళ్లను తొలగించడం, సిమెంట్ ఫిల్లింగ్, దంత సంబంధిత సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. ఈఅవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

ఉండి: అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచి మాట తప్పారని సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరిట్ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సోమవారం ఉండి సెంటర్‌లో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారం కోసం అనేక వాగ్ధానాలు చేసిన చంద్రబాబు అధికారం అందిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరిట పేదల, సామాన్యులు, అద్దెకు ఉంటున్న వారి నడ్డి విరుస్తున్నారని అన్నారు. గతంలో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు అదనపు సొమ్ములు చెల్లించాలని బిల్లులు ఇవ్వడం ఎంత వరకు సమంజసం? అని ప్రశ్నించారు .కూటమి నాయకుల వాగ్ధానాలు నమ్మి అత్యధిక మెజారిటీతో విజయాన్ని కట్టబెడితే జరిగిన వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు.వంద రోజుల్లో ఏం చేశారు? అని ప్రజలు నిలదీస్తారని వారికి సమాధానం చెప్పలేక సనాతన ధర్మం, తిరమల లడ్డూ కల్తీ అంటూ డైవర్ట్ రాజకీయాలు చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



తణుకులో నిరసన తెలియజేస్తున్న క్లాప్ డ్రైవర్లు, సీఐటీయూ నేతలు

తణుకు: పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలోని చెత్తను తరలించే క్లాప్ వాహనాల డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో క్లాప్ డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కేవలం నెలకు రూ. 12,500 చెల్లిస్తే పెరిగిన ధరలతో ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. 11 నెలలుగా పీఎఫ్ సొమ్ములు జమ చేయడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయమని అడిగితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎంటీవీవీ గణేష్, ఉపాధ్యక్షుడు ఎం.తాతారావు, సాయి, వరప్రసాద్, ఆదినారాయణ, వెంకట్రావు, మల్లికార్జునరావు, చిన్నారు కేశవరావు, సురేంద్ర పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు టౌన్: చేదోడు, ఆదరణ పథకాలను పునరుద్ధరించి చేతి వృత్తిదారులను ఆదుకోవాలని సీపీ నాయకులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని కోరారు. వృత్తిలో వస్తున్న మార్పుల కారణంగా ఉపాధి కోల్పోతున్న చేతి వృత్తిదారులను ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసి ఆదుకోవాలని కోరారు. ఈమేరకు సోమవారం వేల్పూరు సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో తణుకు తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.గత ప్రభుత్వం చేదోడు పథకం ద్వారా చేతి వృత్తుదారులైన రజక, నాయీ బ్రాహ్మణులకు ఏటా రూ. 10 వేల ఆర్థిక సహాయంఅందించేదని ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. చేతి వృత్తి దారులకు తక్షణం 50 శాతం సబ్సిడీతో రూ. 2 లక్షలు రుణాలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వర్మకు అందజేశారు. ఈకార్యక్రమంలో రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర నాయకుడు యండమూరి నాగేంద్ర, టైలర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరపు నాగరాజు, వాసా వెంకటేశ్వరరావు, కే వీరభద్రరావు, కోటిచుక్కల నాగేంద్ర, కరెళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొడ్డిగా క్రీడా ప్రాంగణం



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో తిష్టవేసిన పశువులు



ఎంఈవో కార్యాలయం ముందు ఉన్న పశువులు

- పశువుల తిష్టతో భయపడుతున్న విద్యార్థులు
- దూరంగా తరలించాలంటూ అభ్యర్థిస్తున్న వైనం

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పశువులు తిష్టవేస్తున్నాయి. నిత్యం ఉదయాన్నే హైస్కూల్‌లోకి ప్రవేశిస్తున్న పశువులు సాయంత్రంవరకు క్రీడా ప్రాంగణంలోనే తిష్ట వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ హవర్‌లో క్రీడా ప్రాంగణంలోకి రావాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. క్రీడల్లో ప్రాక్టీస్ చేయాలంటే పశువులు అడ్డంకిగా ఉంటున్నాయని, దగ్గరికి వెళ్తుంటే మీదకి వస్తున్నాయని విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. అంతేకాకుండా పాఠశాలకు వెళ్లేదారిలో కూడా పశువులు తిరుగుతుండడంతో పాఠశాలలోకి రావాలంటే భయమేస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.

రోడ్డుపై నుంచి పాఠశాలలోకి..

గతంలో రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డులో తిష్టవేసే పశువులు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించే పరిస్థితులు నెలకొనడంతోపాటు వాటికి కూడా ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితుల్లో మునిసిపల్ అధికారులు ఇటీవల కాలంలో వీటిపై ఉక్కుపాదం మోపారు. పశువులను బయటకు వదిలితే దూరంగా తరలిస్తామని పశు యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కొన్ని రోజులు పశు యజమానులు ఈ పశువులను బయటకు వదలకుండా జాగ్రత్తలు పాటించినప్పటికీ గత వారం రోజులుగా పశువులను వాటి యజమానులు ఉదయాన్నే పాఠశాల గేటులో పలకి వదిలి వెళ్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యను గుర్తించి పాఠశాలలోకి పశువులు రాకుండా చూడాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



ఏలేటిపాడులో విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఇరగవరం: విద్యార్థి దశ నుంచే అవినీతి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ పాటుపడాలని బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జ్ ఈ రాంబాబు అన్నారు. ఇరగవరం మండలం ఏలేటిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవినీతి నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ యు శ్రీదేవి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, ప్రతీ ఒక్కరూ నిజాయితీ, నిబద్ధత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, హెచ్ఎం డీఆర్‌వీ సత్యనారాయణ, బ్యాంకు మేనేజర్ కేఎం సుబ్బారెడ్డి, ప్రాంతీయ కార్యాలయం ప్లానింగ్ అధికారి బానీల్‌కిషన్, బ్యాంకు అధికారి బి మల్లిఖార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సామాజిక న్యాయం పాటించాలి

తణుకు టౌన్: పాఠశాల విద్య శాఖలో ఉన్నతాదికారుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలని సోషల్ జస్టిస్ ఫోరం నాయకులు యర్రాకులు తులసీరామ్ యాదవ్, కృష్ణాంజనేయులు, శ్రీనివాస్, హరనాథ్ తదితరులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు వర్గాలకు చెందిన ఎందరో పదోన్నతులు కోసం ఎదురు చూస్తున్నా ఈ శాఖలో ప్రాధాన్యత ఉన్న పోస్టులన్నీ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు సిండికేట్‌గా ఏర్పడిపోయి కీలకమైన పోస్టులు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖా మంత్రి స్పందించి అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

CHANGE OF NAME

I, Penmetsa Srinivasa Raju (New Name), S/o Penmetsa Satyanarayana Raju, Previously called Penumetasa Sirinivasa Raju (Old Name), Resident of Door No.22- 18-12, GF, Sree Rama Towers, Sajjapuram, Tanuku Mandal, W.G Dist, A.P., Now changed my name from Penumetasa Sirinivasa Raju (Old Name) to Penmetsa Srinivasa Raju (New Name). Today onwards use my new name for all further transactions